క్లుప్తంగా

విద్యుత్ మరమ్మతులు


విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 14వ వార్డు సుభద్రానగర్, గున్నేశ్వరనగర్ వీధులు, జెడ్పీ హెచ్ స్కూల్ గ్రౌండ్‌లో కొత్త విద్యుత్ దీపాలు శనివారం ఏర్పాటు చేశారు. ఆ వార్డు కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాస్ పర్యవేక్షణలో మరమ్మతులు చేపట్టారు. స్ట్రీట్ లైట్ మరమ్మతులు, నూతన లైట్లు ఏర్పాటుపై చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ రామారావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సలహా మండలి సభ్యుడిగా కోత


కోత మధుసూదనరావు

టెక్కలి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధన సలహా మండలి సభ్యుడిగా సంతబొమ్మాళి మండలం కోటపాడు గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు కోత మధుసూదనరావు నియమితులయ్యారు. ఈ మేరకు పరిశోధన కేంద్రం డైరెక్టర్ సత్యనారాయణ నుంచి నియామక పత్రాన్ని శనివారం అందుకున్నారు. వ్యవసాయ పరిశోధన సలహా మండలి సభ్యునిగా ఎంపిక చేయడంపై జిల్లాకు చెందిన నాయకులు, వ్యవసాయాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్పీని కలిసిన బారువ ఎస్ఐ


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బారువ ఎస్ఐ హరిబాబు

సోంపేట: సాధారణ బదిలీల్లో భాగంగా బారువ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన హరిబాబునాయుడు జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, మాదక ద్రవ్యాలు నియంత్రణ, సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

పాఠశాలకు విరాళం


విరాళం ప్రకటిస్తున్న ప్రత్యేకాధికారి జేఈ విష్ణుమూర్తి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొళిగాం ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన మెగా పేరెంట్స్ ఆత్మీయ సమావేశానికి ప్రత్యేకాధికారిగా వ్యవహరించిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కూనప విష్ణుమూర్తి పెద్ద మనసు చాటుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు భోజనాలు చేసేందుకు నిర్మిస్తున్న భోజన శాల నిర్మాణానికి ఆయన తన వంతుగా రూ.10 వేల విరాళం ప్రకటించారు. ప్రధానోపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్‌కు చెక్ అందజేశారు.

రుణాలు మంజూరుకు సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న ఏపీఎం ప్రసాదరావు తదితరులు

కంచిలి: అర్హత కలిగిన స్వయం శక్తి సంఘాలన్నింటికీ బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చేందుకు మఠం సరియాపల్లి ఏపీజీవీబీలో ఐకేపీ ఏపీఎం ఎస్.ప్రసాదరావు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ బ్యాంకు పరిధిలో ఉన్నటువంటి స్వయంశక్తి సంఘాలకు ఉమెన్ లెటర్ రుణాలు, పీఎంఎఫ్ఎంఈ, పీఎంజీపీ, ముద్ర తదితర రుణాలు ఇవ్వాల్సిందిగా బ్రాంచ్ మేనేజర్ కె.తిరుపతిరావుతో చర్చించారు. సమీక్షలో క్లస్టర్ సీసీ రాణి, వీవోఏలు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం


ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న సామగ్రి

సోంపేట: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మందస మండలం పట్టులోగాంలో ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడుల్లో 800 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు సీఐ కె.బేబీ శనివారం తెలియజేశారు. అనంతరం గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దాడుల్లో సోంపేట, పలాస సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాష్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

భద్రం
బీ కేర్ ఫుల్ బ్రదరూ..!

- ప్రాణాలు తీస్తున్న అతివేగం
- మైనర్ల డ్రైవింగ్‌తో అధిక ప్రమాదాలు
- చర్యలు తీసుకోవాలని విన్నపాలు

టెక్కలి రూరల్: ఇటీవల కాలంలో యువత బైక్ రైడింగ్‌కు ఆకర్షితులవుతున్నారు. అధిక సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన ద్విచక్ర వాహనాలపై రయ్.. రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. నిన్న మొన్నటి వరకు పెద్ద, మెట్రో నగరాల్లో కనిపించిన క్రేజీ బైక్ రైడింగ్ నేడు టెక్కలి పట్టణానికి విస్తరించింది. చదువుల్లో దూసుకుపోవాల్సిన యువత ద్విచక్ర వాహనాలపై దూసుకెళ్తున్నారు. రోడ్ల నిబంధనలు పాటించకుండా, హెల్మెట్లు ధరించకుండా ఇలా వేగంగా ద్విచక్ర వాహనాన్ని నడపడం ప్రమాదకరమని పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నారు. అయినా వారి మాటలను లెక్క చేయడం లేదు. ముఖ్యంగా మైనర్లు ద్విచక్ర వాహనాలను అధిక వేగంతో నడుపుతుండడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా లైసెన్స్ పొందాలంటే కనీసం 18 సంవత్సరాలు నిండాలి. కానీ రోడ్లపై 18 సంవత్సరాల్లోపు వారు ద్విచక్ర వాహనాలను నడుపుతూ తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా ఆటోలు, కార్లు, వ్యాన్లు నడిపే వారిలో సైతం చాలామంది మైనర్లు, లైసెన్స్‌లు లేనివారు ఉండడం విశేషం.

ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు...

ఇటీవల కాలంలో టెక్కలి సమీపంలోని ఇందిరా గాంధీ జంక్షన్ వద్ద ఒక మైనర్ బాలుడు అతివేగంగా తన ద్విచక్రవాహనంపై వెళ్లడంతో వెనుక కుర్చొని ఉన్న వ్యక్తి కిందపడి తీవ్రగాయాలకు గురైయ్యాడు. అలాగే గతంలో టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సమీపంలో ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన వ్యక్తిని బలంగా ఢీకొనడం జరిగింది. ఇలా అనేక ఘటనలు మైనర్ బాలురు వాహనాలు అతివేగంగా నడుపుతుండడం వలన చోటుచేసుకుంటున్నాయి. అందువలన ఇప్పటికైనా సంబంధిత పోలీసు అధికారులు స్పందించి, మైనర్ డ్రైవర్లు, అతివేగంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం



ఇటీవల కాలంలో మైనర్, ర్యాష్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. టెక్కలిలో అతివేగంగా వెళ్లే చాలా వాహనాలను అదుపులోకి తీసుకుని అపరాధ రుసుము విధించాము. అలాగే ముగ్గురు మైనర్ బాలలను అదుపులోకి తీసుకున్నాం. వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. మైనర్లు వాహనాలు నడపడం ప్రమాదకరం. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి.

– ఎ.విజయ్‌కుమార్, టెక్కలి సీఐ

అతివేగం మంచిది కాదు



ఇటీవల కాలంలో పిల్లలు తమ ద్విచక్ర వాహనాలపై అతివేగంగా వెళ్తున్నారు. దానివలన ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ప్రమాదాలు జరిగితే ఆ పిల్లలను కన్న తల్లిదండ్రులకు ఎంతో శోకం మిగులుతుంది. కావున చాలా జాగ్రత్తగా వాహనాలు నడిపితే మంచిది.

– మెట్ట జగన్నాథరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, టెక్కలి

మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు



మైనర్ బాలురకి వాహనాలు ఇవ్వడం వలన వారికి రోడ్డు నియమాలపై అవగాహన పూర్తిస్థాయిలో ఉండదు. అందువలన వారు ప్రమాదాలకు గురవ్వడంతో పాటు ఎదుటి వారు సైతం ప్రమాదంలో పడేలా చేస్తున్నారు. కావున మైనర్లకు వాహనాలు ఎంత దూరంగా ఉంచితే అంత మంచిది.

– చల్ల రామారావు, ఉపాధ్యాయుడు

మంత్రి అచ్చెన్నను కలిసిన సివిల్ సప్లయ్ డీఎం

టెక్కలి: రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం వేణుగోపాల్ శనివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం గౌరవప్రదంగా భేటీ అయ్యారు. అలాగే టెక్కలి డీఎస్పీ డీఏస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి సైతం మంత్రిని కలిశారు.


మంత్రి అచ్చెన్నాయుడితో డీఎం వేణుగోపాల్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ బేబీ

టెక్కలి రూరల్: గ్రామాల్లోని ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో సంకల్పం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, అందువలన ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి


కవిటి: బొరివంక సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు ఆకాంక్షించారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధి కోసం అవసరమైన పలు సూచనలు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. అనంతరం తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, క్రీడలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కంచిలి: జాడుపూడి కేజీబీవీలో బహుమతులు అందిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు


కాశీబుగ్గలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష


ఇచ్ఛాపురం: మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థినిని అభినందిస్తున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి తదితరులు

అగ్నిగుండం మహోత్సవం నేడు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం కొత్తపేట గ్రామంలో భవానీ స్వాముల ఆధ్వర్యంలో అగ్నిగుండం మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలిండియా భవానీ దీక్షా చారిటబుల్ ట్రస్టు కమిటీ సభ్యుడు తూలుగు నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు జంగిడి ఊరేగింపుతో ఆరంభం కానున్న ఈ మహోత్సవంలో భాగంగా, మధ్యాహ్నం అన్నసమారాధనతో పాటు రాత్రి 8 గంటలకు అగ్నిగుండం మహోత్సవం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ


పద్మనాభపురంలో సన్నిపూజలో అయ్యప్పస్వాములు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని దత్త అయ్యప్ప సన్నిధానం స్వాములు భక్తిశ్రద్ధలతో శనివారం పడిపూజ నిర్వహించారు. 50 మంది స్వాములతో నిర్వహిస్తున్న సన్నిధానంలో ఉండే స్వాముల స్వగృహాల వద్ద సన్నిపూజలు చేసి, జ్యోతి వెలిగించి శబరిమల యాత్రకు బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వామి కొండే నరసింహ, స్వాములు గణప అప్పారావు, దుబ్బ రాజగోపాల్, కొండే తిరుపతి, పొలారి పాపారావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం

కవిటి: జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డా.పూడి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం కవిటిలో అతనికి ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ నేత మద్దు సర్వేశ్వరరావు, యలమంచి కృష్ణారావు, ఆలీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి

ఇచ్ఛాపురం: గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, బెల్లుపడ శివానంద గిరిపై కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో షష్టి పూజలను శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. సామూహిక కుంకుమ పూజల అనంతరం ఆలయంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు.


సోంపేట: పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్య స్వామి

సోంపేట: సోమేశ్వర దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చన, అభిషేకం, హోమం, పాలకావిడి చేపట్టారు. భక్తులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

పొలం గట్లపై బంతిసాగు



పలాస మండలం రెంటికోట గ్రామంలో పొలం గట్లు మీద రైతులు బంతిపూలను సాగు చేస్తున్నారు. దీంతో గ్రామానికి వెళ్లేవారికి బంతిపూలు స్వాగతం పలుకుతున్నట్లు ఉంటాయి. గట్లపై సాగు చేస్తున్న పూలతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తోంది. – పలాస

వైద్య శిబిరం



ఇచ్ఛాపురం రూరల్ మండలం మండపల్లి పంచాయతీలోని బుడ్డేపుపేట గ్రామంలో శనివారం రాగోలు జెమ్స్ వైద్య బృందం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. పాలేపు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వంద మందికిపైగా రోగులలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. సమస్యలతో బాధపడుతున్న రోగులను వైద్యులు జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. – ఇచ్ఛాపురం రూరల్

అవగాహన



ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో హెచ్ఐవీపై ఐసీటీసీ అధ్వర్యంలో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో అవగాహన కల్పించారు. సీహెచ్‌సీ నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ కూడలిలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి దేవేంద్రరెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ రాజశేఖర్, మోహన్, రవికుమార్, రవిప్రసాద్, సీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం

పీటీఎం పేరుతో ఆర్భాటమే

టెక్కలి: ప్రభుత్వం పీటీఎం పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్భాటం చేస్తోందని కోటబొమ్మాళి మండలం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సంపతిరావు హేమసుందర్‌రాజు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి దారుణంగా తయారైందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి గమనిస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి అర్థమవుతుందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రతీ విద్యార్థికి ఇస్తామన్న తల్లికి వందనం పథకంపై ప్రజలు నిలదీస్తారనే భయంతో, ఇటువంటి ఆర్భాట కార్యక్రమాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తల్లికి వందనం అందజేయాలని కోరారు.

తిలక్ పరామర్శ

టెక్కలి: నియోజకవర్గంలోని పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ శనివారం పరామర్శించారు. టెక్కలి ఎంపీపీ అట్ల సరోజనమ్మ కుమార్తె ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. సంతబొమ్మాళి మండలం మహదేవపురం గ్రామంలో బలిడే లక్ష్మీనారాయణ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, ఆర్‌హెచ్‌పురం గ్రామంలో కరిమి రాజులు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, చెట్లతాండ్ర గ్రామంలో పంగ లక్ష్మీనారాయణ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, నందిగాం మండలం కొండతెంబూరు గ్రామంలో కణితి కృష్ణమూర్తి భార్య మృతి చెందడంతో వారిని పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. అలాగే ఆర్‌హెచ్‌పురం సర్పంచ్ ఎన్ని మన్మథరావు ఇటీవల గాయపడడంతో పరామర్శించారు. ఆయనతో పాటు నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, నాయకులు కె.బాలకృష్ణారావు, జె.జయరాం, చిన్ని జోగారావు, ఎ.విష్ణు, ఎ.లోకనాథం, పంగ రామయ్య, పి.అప్పన్న, టి.మోహన్‌రావు, ఆర్.జయమోహన్, హెచ్.వెంకటేశ్వరరావు, పి.చంద్రశేఖర్, సీహెచ్ అప్పన్న, బి.కూర్మారావు తదితరులు ఉన్నారు.


ఎంపీపీ సరోజనమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న పేరాడ తిలక్ తదితరులు

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు


బదిలీ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

కవిటి: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు, గౌరవం లభిస్తాయని సర్పంచ్ ఊర్మిళ అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన కుసుంపురం గ్రామ సచివాలయం ఉద్యోగులైన పంచాయతీ సెక్రటరీ కె.రవిబాబు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి.శ్రీనివాస్, మహిళా పోలీస్ డి.శ్రీదేవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బి.శ్రీలక్ష్మి, ఎనర్జీ అసిస్టెంట్ జి.సతీష్‌లను శనివారం సత్కరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు సాధించిన వీరంతా విధుల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శివ బిసాయి, ఎంపీటీసీ కర్రి పద్మావతి, సత్యనారాయణ, నల్లాన శ్రీనివాసరావు, సింధుల శ్రీనివాసరావు, మేఘనాథబిసాయి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీపీ పరామర్శ

కంచిలి: మండలంలోని బొగాబెణి, ఎస్.ఆర్.సి.పురం పంచాయతీల్లో మృతి చెందిన పలువురి కుటుంబాలను స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి శనివారం పరామర్శించారు. జెన్నాగాయి గ్రామానికి చెందిన గుమ్మడి దండాసి, బొనమాళి గ్రామానికి చెందిన జోటియా మోహనరావు, రెడ్డి చిన్నయ్య, ఉమ్మడి మహాలక్ష్మిలు, ఎస్.ఆర్.సి.పురం పంచాయతీకి చెందిన సూరిశెట్టి అప్పారావులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయనతో పాటు మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, లద్దు కేశవపాత్రో, బొగాబెణి సర్పంచ్ గణప సింహాచలం, కుణితి తిరుపతి, నేతలు డొక్కరి బలరాం, మద్దు రుషి, గుమ్మిడి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


మహాలక్ష్మి కుటుంబాన్ని రామర్శిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు